

నిబంధనలు పాటించకపోతే చర్యలు

తొగుట, ఫిబ్రవరి 2: ట్రాఫిక్ నిబంధనలు పాటించక కఠిన చర్యలు తప్పవని తొగుట ఎస్ఐ లింగం హెచ్చరించారు. రోడ్డు భద్రతా వారోత్సవాలలో భాగంగా శుక్రవారం తొగుట మండలం రాంపూర్ చౌరస్తాలో వాహనాలను తనిఖీ చేశారు. అనంతరం ఆయన ట్రాఫిక్ నిబంధనలపై వాహనదారులకు అవగాహన కల్పించారు. మద్యం సేవించి వాహనాలను నడపకూడదని సూచించారు. మోటర్‌సైకిల్ నడిపేవారు తప్పకుండా హెల్మెట్ ధరించాలని చెప్పారు.

రోడ్లకు రూ.వంద కోట్లివ్వండి

- ఉత్తమ్, కోమటిరెడ్డిలను కోరిన మంత్రి పొన్నం

హుస్నాబాద్, ఫిబ్రవరి 2: హుస్నాబాద్ నియోజకవర్గంలోని నాలుగు ఆర్‌అండ్‌బీ రోడ్ల నిర్మాణానికి రూ.100 కోట్లు మం జూరు చేయాలని కరీంనగర్ ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకటరెడ్డిని కోరినట్లు రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ప్రకటన విడుదల చేశారు. హుస్నాబాద్ నుంచి రామవరం వరకు రూ.25కోట్లు, అంతకపేట నుంచి కొత్తకొండ వరకు రూ.26 కోట్లు, గన్నెరువరం నుంచి బెజ్జంకి వరకు రూ. 25కోట్లు, రాంనగర్ తండా నుంచి మడిపల్లి క్రాస్ వరకు రూ. 25కోట్ల నిధులు మంజూరు చేయాలని కోరినట్లు పేర్కొన్నారు.

'గురుకులం' సదుపాయాలపై అసంతృప్తి

తూప్రాన్, జనవరి 2 : తూప్రాన్ పట్టణ పరిధి అల్లాపూర్ శివారులోని గురుకుల పాఠశాల, కళాశాలను శుక్రవారం బీసీ సంక్షేమం, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్, మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల ఆవరణ శుభ్రంగా లేకపోవడం, విద్యార్థుల వసతి, తరగతి ఒకే గదిలో ఉండటంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. వెంటనే ఆర్డీవో జయచంద్రారెడ్డి, మున్సిపల్ కమిషనర్ ఖాజామొహిజుద్దీన్, తహసీల్దారు విజయలక్ష్మీలను పిలిపించి గురుకుల విద్యాలయం సమస్యలపై ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. పాఠశాలలోని సమస్యలను మంత్రి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రహరీ సక్రమంగా లేకపోవడంతో కుక్కలు వస్తున్నాయని విద్యార్థులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. కొందరు విద్యార్థులు చెట్ల కింద చదువుతుండటంపై ఆయన ఆరా తీశారు. స్పందించిన మంత్రి వెంటనే అదనపు తరగతి గదుల నిర్మాణం చేపట్టాలని ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశంతోపాటు, రెసిడెన్షియల్ స్కూల్స్ కమిషనర్ రమణకుమార్, మెదక్ కలెక్టర్ రాజర్షిషాతో ఫోన్‌లో మాట్లాడారు. గురుకుల విద్యాలయంలో ఎలాంటి సమస్యలు లేకుండా చూడాలని వారిని ఆదేశించారు. విద్యార్థులకు బెడ్లను ఏర్పాటు చేయాలని ఆర్డీవోను, పాఠశాల మైదానంలో ఆట వస్తువులతోపాటు ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని, పాఠశాల ఆవరణ శానిటేషన్ పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ ఖాజా మొహిజుద్దీన్‌ను, ప్రహరీ నిర్మాణం త్వరగా పూర్తిచేయాలని తహసీల్దారును ఆదేశించారు.



మనోహరాబాద్-కొత్తపల్లి రైల్వేలైను నిర్మాణ పనులు (ఫైల్)

రూ.350 కోట్లతోనే సరి

మనోహరాబాద్ కొత్తపల్లి రైల్వేలైను నిర్మాణం నత్తనడకన సాగుతున్నది. 2016లో మొదలైన పనులు నేటికీ పూర్తికాలేదు. 151 కిలోమీటర్ల పొడవైన ఈ రైల్వేలైనులో ఇప్పటికీ సగం లైను మాత్రమే పూర్తయింది. కేంద్రం కొసిరికొసిరి నిధులు వడ్డిస్తుండడం కూడా జాప్యానికి కారణం. తాజా బడ్జెట్‌లో రూ.350 కోట్లు ఈ రైల్వేలైను నిర్మాణానికి కేటాయించడం శుభపరిణామమే అయినప్పటికీ ఈ నిధులతో కొత్తపల్లి దాకా చేరడం అసాధ్యంగా భా.వించాల్సిన పరిస్థితి కనిపిస్తున్నది.

బడ్జెట్‌లో మనోహరాబాద్-కొత్తపల్లి రైల్వేలైన్‌కు నిధులు

- ఇప్పటికే సిద్దిపేట వరకు 76కి.మీ.ల లైన్ పూర్తి
- ఇంకా 75కి.మీ.ల పనులపై కసరత్తు
- తాజా బడ్జెట్‌తో కొత్తపల్లి చేరడం కష్టమే

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సిద్దిపేట, ఫిబ్రవరి 2: మెదక్ జిల్లాలోని మనోహరాబాద్ నుంచి సిద్దిపేట, రాజన్న సిరిసిల్ల జిల్లాల మీదుగా కరీంనగర్ జిల్లా కొత్తపల్లి వరకు చేపట్టిన రైల్వేలైను నిర్మాణానికి తాజా బడ్జెట్‌లో రూ.350 కోట్లు కేటాయించారు. 2016-17లో రూ.1,160 కోట్ల అంచనాతో ఈ లైనుకు శంకుస్థాపన చేశారు. ఇందులో మూడోవంతు వాటాతో పాటు ఉచితంగా భూసేకరణ బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించారు. ఇప్పటికే భూసేకరణ పూర్తయ్యింది. 151 కి.మీలలో 76 కి.మీల లైను ఏర్పాటు కావడంతోపాటు సిద్దిపేట నుంచి సికింద్రాబాద్‌కు రైలు రాకపోకలు కొనసాగుతున్నాయి. ఇక సిద్దిపేట నుంచి కొత్తపల్లి వరకు 75కి.మీల లైను నిర్మాణం పూర్తికావాల్సి ఉంది. ఇది పూర్తయితేనే అనుకున్న లక్ష్యం నెరవేరుతుంది.

70 గ్రామాలు.. 15 స్టేషన్లు

మెదక్, సిద్దిపేట, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్ జిల్లాల పరిధిలోని 70 గ్రామాల మీదుగా ఈ రైల్వేలైను నిర్మిస్తున్నారు. ఇప్పటికే వర్గల్ మండలం నాచారం, రాయపోల్ మండలం అప్పాయిపల్లి, బేగంపేట, గజ్వేల్ మండలం కొడకండ్ల, కొండపాక మండలం దుద్దెడ, సిద్దిపేట స్టేషన్ల నిర్మాణం పూర్తయింది. గజ్వేల్‌లో ఎరువుల దిగుమతి కోసం పాయింట్‌ను కూడా ఏర్పాటు చేశారు. కొమురవెల్లి రైల్వేస్టేషన్ నిర్మాణంలోనూ స్పష్టత వచ్చింది. ఇక్కడ స్టేషన్ నిర్మాణానికి ఇటీవలే కేంద్రం నుంచి సంకేతాలు అందాయి. ఇక మెదక్ జిల్లా మనోహరాబాద్ నుంచి కరీంనగర్ జిల్లా కొత్తపల్లి వరకు 15 స్టేషన్లు ఉంటాయి. మెదక్ జిల్లాలో 9.30 కిలోమీటర్లు, సిద్దిపేట జిల్లాలో 83.40 కిలోమీటర్లు, రాజన్న సిరిసిల్ల జిల్లాలో 37.80 కిలోమీటర్లు, కరీంనగర్ జిల్లాలో 20.86 కిలోమీటర్ల మేర ట్రాక్ నిర్మాణం ఉంటుంది. త్వరితగతిన నిధులు సమకూరితే వచ్చే రెండేళ్లలో కరీంనగర్ జిల్లా కొత్తపల్లి వరకూ ట్రాక్ పూర్తవడంతో పాటు రైళ్ల రాకపోకలు కొనసాగుతాయి. అంతేకాకుండా ఉత్తర, దక్షిణ భారతదేశాన్ని అనుసంధానించేలా ఈ రైల్వేలైను నిర్మాణం ఉండబోతుంది.



నేటికీ ఒక్కటే రైలు

గత అక్టోబరు 3 నుంచి సిద్దిపేట-సికింద్రాబాద్ నడుమ రైలు రాకపోకలు ప్రారంభమయ్యాయి. నిత్యం సిద్దిపేట నుంచి రెండుసార్లు రైలు బయల్దేరుతుంది. అయితే సిద్దిపేట నుంచి తిరుపతి, మైసూరు, బెంగళూరుకు రైలు సర్వీసులు నడిపిస్తారని అప్పట్లో చర్చ జరిగింది. కానీ నేటికీ ఒక్క రైలుతోనే సరిపెడుతున్నారు. ఈ ప్రాంతం నుంచి పెద్ద సంఖ్యలో తిరుపతికి వెళ్తుంటారు. వీరంతా సికింద్రాబాద్, వరంగల్, కరీంనగర్ రైల్వేస్టేషన్లను ఆశ్రయిస్తున్నారు. ఇక్కడి నుండే నేరుగా తిరుపతికి రైలు సౌకర్యాన్ని కల్పించాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు. రైలు సర్వీసు ప్రారంభించి దాదాపు 4 నెలలు పూర్తయినందున ఎక్స్‌ప్రెస్ రైలు సౌకర్యాన్ని ఈ మార్గంలో ఏర్పాటు చేయాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

'ఉపాధి హామీ' తో సుస్థిర ఆస్తులు

- అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్

సిద్దిపేట రూరల్, ఫిబ్రవరి 2: జాతీయ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలతో గ్రామాలు అభివృద్ధి చెందుతాయని జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ పేర్కొన్నారు. శుక్రవారం సిద్దిపేటరూరల్ మండలంలోని చిన్నగుండవెల్లిలో నిర్వహించిన ఉపాధిహామీ పథకం దినోత్సవంలో ఆమె మాట్లాడారు. గ్రామంలోని ఉపాధి కూలీలందరూ పనులకు హాజరుకావాలని సూచించారు. జాబ్‌కార్డు ఉండి పనిచేయకపోతే కార్డు రద్దవుతుందని తెలిపారు. వందరోజులు పనిచేసిన కూలీల పిల్లలకు ఉన్నతి కేంద్రం ద్వారా శిక్షణా నైపుణ్యాలను నేర్పించి వివిధ పరిశ్రమలలో ఉపాధి కల్పిస్తామన్నారు. గ్రామాల్లోని ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామపంచాయతీ భవనాలు, సీసీరోడ్లు, డంపింగ్‌యార్డులు, శ్మశానవాటిక వంటి శాశ్వత నిర్మాణాలకు ఉపాధిహామి ద్వారా వచ్చిన నిధులనే వినియోగిస్తున్నారు. ఏ గ్రామంలో అయితే ఉపాధి కూలీలు అధిక సంఖ్యలో పనిచేస్తారో, ఆ గ్రామానికి అధిక మొత్తంలో నిధులు వస్తాయన్నారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ కూలీలను సన్మానించారు. కార్యక్రమంలో డీఆర్డీవో పీడీ జయదేవ్, ఎంపీడీవో కుమారస్వామి, ఎంపీవో హరిప్రసాద్, ఏపీవో శ్రీనివాస్, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్‌అసిస్టెంట్లు పాల్గొన్నారు.



ఉపాధి కూలీల హాజరు పట్టికను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్



ఆశల పూత

- పూతకు వస్తున్న మామిడితోటలు
- జిల్లాలో13 వేల ఎకరాల్లో సాగు
- భయపెడుతున్న వాతావరణం

7

త్వరలో పెళ్లి.. యువతిని తీసుకెళ్లిన యువకుడు

- ఆగ్రహంతో ఇంటికి నిప్పు పెట్టిన యువతి కుటుంబీకులు

శివ్వంపేట, ఫిబ్రవరి 2: మరికొన్ని రోజుల్లో వివాహం చేసుకోబోతున్న తమ కుమార్తెను ఓ యువకుడు ప్రేమపేరిట మాయమాటలు చెప్పి తీసుకెళ్లాడని ఆరోపిస్తూ యువతి కుటుంబసభ్యులు సదరు యువకుడి ఇంటికి నిప్పు పెట్టారు. ఈ ఘటన మెదక్ జిల్లా శివ్వంపేట మండలం దొంతి గ్రామంలో శుక్రవారం జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం దొంతి గ్రామానికి చెందిన ఒకరు తన కుమార్తె వివాహం ఈ నెల28న చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఆమెను ప్రేమించిన ప్రశాంత్ అనే యువకుడు విషయం చెప్పకుండా యువతిని ఇంటి నుంచి తీసుకెళ్లి పెళ్లి చేసుకున్నాడు. విషయం తెలిసిన యువతి కుటుంబసభ్యులు ఆగ్రహంతో ఊగిపోతూ శుక్రవారం ప్రశాంత్ ఇంటికి వెళ్లి నిప్పటించారు. ఇంట్లోని గ్యాస్ సిలిండర్ పేలడంతో ఇల్లంతా దగ్ధమైంది. విషయం తెలుసుకున్న సీఐ కృష్ణ, ఎస్ఐ రవికాంత్‌రావుతో పాటు పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు. యువతి వివాహానికి రూ.పది లక్షల అప్పు చేసి ఏర్పాట్లు చేయగా, ఇలా జరగడంతో యువతి కుటుంబీకులు ఆగ్రహంతో ఇలా చేశారని స్థానికులు అంటున్నారు.



తగులపెట్టిన ఇంటిని పరిశీలిస్తున్న పోలీసులు

క్రీడాహబ్‌కు మోక్షమెప్పుడో?

- గజ్వేల్‌లో ఏర్పాటుకు గత ప్రభుత్వం ప్రకటనలు
- అదనంగా మరో ఆరు ఎకరాలు కేటాయిస్తూ ఉత్తర్వులు
- నిధులు మంజూరు చేయడంలో విఫలం
- ఏళ్లుగా క్రీడాకారులకు తప్పని ఎదురుచూపులు
- కాంగ్రెస్ ప్రభుత్వంపైనే క్రీడాభిమానుల ఆశలు



గజ్వేల్ పట్టణంలోని ప్రస్తుత మినీ స్టేడియం

గజ్వేల్, ఫిబ్రవరి 2: ఆధునిక హంగులు, అత్యాధునిక టెక్నాలజీతో గజ్వేల్‌లో అత్యద్భుతమైన క్రీడాహబ్‌ను నిర్మిస్తామని గత ప్రభుత్వంలో ప్రజాప్రతినిధులు ఊదరగొట్టారు. అదిగో.. ఇదిగో.. అంటూ పెద్దఎత్తున ప్రచారం చేసి 20 ఎకరాల భూమిని స్టేడియం ఏర్పాటుకు సేకరిస్తున్నామని ప్రకటించారు. పట్టణం లోని మినీ స్టేడియానికి ఆనుకుని ఉన్న భూమిని సేకరించి, త్వరలోనే నిధులను మంజూరు చేయిస్తామని చెప్పారు. అదనంగా మరో ఆరు ఎకరాల భూమిని స్టేడియానికి కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే నిధులు మంజూరు చేయకపోవడంతో నేటికీ ఒక్కఅడుగు కూడా ముందుకు పడలేదు. అప్పటి అధికారుల నిర్లక్ష్యమో... గత పాలకుల పట్టింపులేని తనమో తెలియదు కానీ క్రీడాహబ్ ఏర్పాటుకు మోక్షం లభించలేదు. అన్ని ఆటలకు సంబంధించిన క్రీడాహబ్ వస్తే ఆయా రకాల క్రీడల్లో యువత తమ నైపుణ్యాన్ని పెంచుకునే అవకాశం ఉంటుంది. పట్టణ విస్తరణ పెరిగినప్పటికీ ప్రజలకు అవసరమైన స్టేడియం, క్రీడాప్రాంగణం లేకపోవడంతో క్రీడాకారులు నిరాశకు గురవుతున్నారు.

ఆర్‌టీఏ కార్యాలయంగా ప్రస్తుత మినీ స్టేడియం

ప్రస్తుతం గజ్వేల్‌లోని తూప్రాన్ రోడ్డులో మినీ స్టేడియం ఉంది. ఇది పట్టణానికి దూరంగా ఉండడం, రాత్రైతే ఆ ఏరియాలో ఎవరూ ఉండకపోవడంతో మందుబాబులకు అడ్డాగా మారింది. దీంతో మినీ స్టేడియానికి వెళ్లాలంటే క్రీడాకారులు ఆసక్తి చూపడంలేదు. సరైన రవాణా సౌకర్యం లేకపోవడం కూడా ప్రధాన సమస్య. వీటికి తోడు ప్రస్తుత మినీ స్టేడియంలో గజ్వేల్ 'ఎంవీఐ' కార్యాలయం ఏర్పాటు చేశారు. ప్రతి మంగళ, శుక్రవారం ఇక్కడ పూర్తి స్థాయిలో ఆర్టీఏసేవలు కొనసాగుతుండడం క్రీడాకారులకు సమస్యగా మారింది.

క్రీడల్లో వెనుకబడుతున్న యువత

గజ్వేల్ పట్టణంతో పాటు నియోజకవర్గవ్యాప్తంగా అనేక క్రీడల్లో నైపుణ్యం కలిగిన యువత ఉన్నారు. కబడ్డీ, క్రికెట్, వాలీబాల్, ఖోఖో, పరుగుపందెం, టెన్నిస్, టార్గెట్ బాల్, చెస్, షటిల్, ఫుట్‌బాల్ ఇలా అనేక క్రీడల్లో రాణిస్తున్నారు. ఈ క్రమంలో వారికి సరైన మైదానం అందుబాటులో లేకపోవడం, నైపుణ్యాన్ని బోధించే శిక్షకులు లేక వారిలోని నైపుణ్యం మరుగునపడుతుంది. గజ్వేల్‌లో క్రీడాహబ్ ఏర్పాటు చేస్తే నియోజకవర్గంతో పాటు దుబ్బాక నియోజకవర్గ క్రీడాకారులకూ ఎంతగానో ఉపయోగపడనుంది.

మినీ స్టేడియం ఉన్నా..

గజ్వేల్‌తో పాటు ప్రజ్ఞాపూర్‌లో సైతం ఎక్కడా క్రీడామైదానం నిర్మాణానికి ప్రభుత్వ స్థలం అందుబాటులో లేకపోవడం పెద్ద మైనస్. గతంలో గ్రామపంచాయతీగా ఉన్న సమయంలోనే స్టేడియం నిర్మాణానికి స్థలాన్ని అన్వేషించినా ఎక్కడా స్థలం లభించకపోవడంతో తూప్రాన్ రోడ్డులో మినీ స్టేడియాన్ని ఏర్పాటు చేశారు. ఈ స్టేడియం ఏర్పాటుకు గజ్వేల్ క్రీడాకారులు, యువజన సంఘాలు పెద్ద ఎత్తున ఉద్యమాలే చేయాల్సి వచ్చింది. ఎట్టకేలకు స్టేడియం నిర్మాణం జరిగినా పూర్తి స్థాయిలో ఆటవస్తువులు లేకపోవడం, అన్ని క్రీడలకు సరిపడా స్థలం లేకపోవడంతో క్రీడల నిర్వహణ ఇబ్బందిగా మారింది. క్రీడాహబ్‌కు ఏర్పాటుకు పూనుకున్నా.. ఆ తర్వాత ఎలాంటి ముందడుగు పడలేదు. ఫలితంగా క్రీడాకారులు తీవ్ర నైరాశ్యంలో మునిగిపోయారు. ఇప్పటికే గజ్వేల్ అన్ని విధాలా అభివృద్ధి చెందిందని ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో క్రీడాహబ్‌కు నిధులను మంజూరు చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని స్థానిక యువత, క్రీడాకారులు, క్రీడాభిమానులు కోరుతున్నారు. ఈ విషయంలో ప్రభుత్వం ఏ మేరకు స్పందిస్తుందో వేచి చూడాలి.



మినీ స్టేడియంలో ఏర్పాటైన ఆర్‌టీఏ కార్యాలయం



నీటి సరఫరా లేక నిరుపయోగంగా మారిన మిషన్ భగీరథ నల్లాలు



ఆన్‌ఆఫ్ ట్యాప్ లేక వృథాగా పోతున్న నీరు

మల్లన్న చెంత.. సమస్యల చింత

- కొమురవెల్లిలో తాగునీటి కష్టాలు
- ఓ చోట వృథా.. మరోచోట వ్యథ
- పునరుద్ధరణ కమిటీలో సమన్వయలోపం
- ప్రసాద కౌంటర్ వద్ద మహిళా భక్తులకు తిప్పలు

చేర్యాల, ఫిబ్రవరి 2: కొమురవెల్లి మల్లన్న దర్శనానికి వచ్చే భక్తులకు అడుగడుగునా సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. స్వామి దర్శనం కోసం గంటల తరబడి క్యూలో నిల్చుని బయటకు వచ్చాక కనీసం గొంతు తడుపుకుందామంటే తాగడానికి నీరు దొరక్క అల్లాడుతున్నారు. ఆలయవర్గాలు, మిషన్‌భగీరథ అధికారుల మధ్య సమన్వయలోపం, నిర్లక్ష్యంతో తాగునీటి సరఫరా సక్రమంగా లేక భక్తులకు ఇబ్బందులు తప్పడం లేదు.

కొమురవెల్లి ఆలయ సమీపంలోని రాతిగీరెల నుంచి గదుల విచారణ కార్యాలయానికి వెళ్లే మార్గంలో టీటీడీ సత్ర ప్రహరీ ఆవరణలో రెండు నల్లాలు ఏర్పాటు చేశారు. వాటికి ఆన్ ఆఫ్ ట్యాప్‌లు ఏర్పాటు చేయకపోవడంతో నీరు వృథాగాపోతున్నది. ఈ మార్గం నుంచే నిత్యం ఆలయాధికారులు, పునరుద్ధరణ కమిటీ సభ్యు లు రాకపోకలు సాగిస్తున్నా అటువైపు కన్నెత్తి చూడకపోవడం గమనార్హం. ఓ వైపు ట్యాప్‌లు ఉన్నా నల్లాలు పనిచేయడం లేదు. మరో వైపు నల్లాల ఉన్నా ట్యాప్‌లు లేక నీరు వృథాగా వెళ్తున్న పరిస్థితులున్నాయి.

పునరుద్ధరణ కమిటీలో లుకలుకలు

మల్లన్న ఆలయ పునరుద్ధరణ కమిటీలో అప్పుడే లుకలుకలు మొదలయ్యాయి. హైదరాబాద్‌కు చెందిన సభ్యులకు మాత్రమే ప్రాధాన్యం ఇస్తున్నారని, తమకు ఎలాంటి ప్రాతినిథ్యం ఇవ్వడం లేదని స్థానిక సభ్యులు గుర్రుమంటున్నారు. ఇతర పార్టీల నేతలకు, మాజీ చైర్మన్లకు ఇచ్చిన గుర్తింపు సొంత పార్టీకి చెందిన వారికి ఇవ్వడం లేదని మండిపడుతున్నారు. వీరంతా మరో మూడునెలలు కొనసాగనున్న క్రమంలో ఎలాంటి పరిమాణాలు చోటుచేసుకుంటాయో చూడాలి.

మహిళలకు అవస్థలు

బుకింగ్ కార్యాలయ ఆవరణలో ప్రసాదం, మొక్కుబడి టికెట్ కౌంటర్లు ఆరు ఉన్నాయి. వీటిలో ఓ కౌంటర్‌ను మహిళల కోసం ఏర్పాటు చేశారు. కానీ అం దుకు తగిన చర్యలు చేపట్టలేదు. ఫలితంగా పురుషులు, మహిళలు ఒకే లైన్‌లో నిల్చుంటున్నారు. మహిళలకు మాత్రం ఇబ్బందులు తప్పడం లేదు. భక్తులకు సేవలందించేందుకు సుమారు 90 మంది వలంటీర్లను నియమించారు. అందులో ఒక్కరిని కూడా మహిళా కౌంటర్ వద్ద ఉంచకపోవడం గమనార్హం. ఆలయవర్గాల వారు వలంటీర్లను తమ వ్యక్తిగత సేవలందించేందుకు, తమ అనుయాయులకు ప్రత్యేక దర్శనం చేయించేందుకు ఉపయోగించుకుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.



స్త్రీలకు కేటాయించిన కౌంటర్‌లోకి పురుషులు చొరబడటంతో ఇబ్బందులు పడుతున మహిళలు

ప్రమాదవశాత్తు నీట మునిగి యువకుడి మృతి



శ్రీకాంత్(ఫైల్)

పాపన్నపేట, ఫిబ్రవరి 2: ప్రమాదవశాత్తు నీట మునిగి యువకుడు మృతిచెందాడు. మెదక్ మండలం రాజ్‌పల్లికి చెందిన పల్లె శ్రీకాంత్(20) కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గురువారం మధ్యాహ్నం గ్రామానికి చెందిన మిత్రుడు హరీశ్‌తో కలిసి ఏడుపాయలకు వచ్చాడు. సాయంత్రం స్నానం చేసేందుకు వనదుర్గా ప్రాజెక్టులోకి దిగి నీట మునిగిపోయాడు. మిత్రుడు హరీశ్ కాపాడేందుకు యత్నించినా సాధ్యపడలేదు. స్థానికులకు, కుటుంబీకులకు సమాచారమందించాడు. స్థానికుల సహాయంతో గాలించగా ఆచూకీ లభించలేదు. శుక్రవారం ఉదయం గజ ఈతగాళ్లతో గాలింపు చేపట్టి మధ్యాహ్నం మృతదేహాన్ని వెలికితీశారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి పోశెట్టి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు.

పటేల్‌గూడలో అనుమతి లేని ఇళ్లు కూల్చివేత



అనుమతులు లేని ఇళ్లను కూల్చివేస్తున్న పంచాయతీ సిబ్బంది

పటాన్‌చెరు, ఫిబ్రవరి 2: అమీన్‌పూర్ మండల పరిధిలోని పటేల్‌గూడ పంచాయతీ పరిధిలో అనుమతులు లేకుండా నిర్మిస్తున్న ఇళ్లను పంచాయతీ సిబ్బంది శుక్రవారం కూల్చివేశారు. గ్రామంలోని రాజరాజేశ్వరీ కాలనీలో అనుమతులు లేకుండా ఇళ్లను నిర్మిస్తున్నారని అధికారుల దృష్టికి రావడంతో చర్యలకు ఉపక్రమించారు. మండల పంచాయతీ అధికారి రాజ్‌కుమార్ నేతృత్వంలో కూల్చివేతలు చేపట్టారు. అనుమతులు లేని 11 ఇళ్లను ధ్వంసం చేశామని తెలిపారు. ఇప్పటికే అనుమతులు లేని ఇళ్లను గుర్తించి నోటీసులు సైతం జారీ చేశామన్నారు.

'పది'లో శత శాతం ఫలితాలు సాధించాలి

● మెదక్ కలెక్టర్ రాజర్షిషా



ప్రేరణ కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాజర్షిషా

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 2: చదువు అనే ఆయుధాన్ని సక్రమంగా వినియోగించుకోవాలని మెదక్ కలెక్టర్ రాజర్షిషా విద్యార్థులకు సూచించారు. శుక్రవారం టీఎన్జీవో భవన్‌లో షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలవేసి, జ్యోతి ప్రజ్వలన చేసి.. పదో తరగతి వసతి గృహ విద్యార్థులకు ప్రేరణ, శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు. వారికి వివిధ పాఠ్యాంశాలపై తర్ఫీదు, మనోధైర్యం, వ్యక్తిగత నైపుణాన్ని పెంచేందుకు నిష్ణాతులైన ఉపాధ్యాయులు, ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ డైరెక్టర్లచే తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో భయం, ఉత్సాహం ఉంటుందని, తమ లక్ష్యాన్ని సాధించే దిశగా చదువుపై దృష్టి సారించాలన్నారు. వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులందరూ పేదరికం నుంచి వచ్చిన వారేనని, చదువుతో మీ భవిష్యత్‌ను మార్చుకొని మీ వంశ వృక్షంలో ఒక మలుపు దిశగా అడుగులు వేస్తూ ముందుకుసాగాలని కలెక్టర్ సూచించారు. వార్డెన్లు విద్యార్థులను ఉదయం నిద్రలేపి చదివించాలని, పరీక్షల సమయంలో క్రమశిక్షణగా ఉండేలా వసతి గృహ అధికారులు బాధ్యత తీసుకోవాలన్నారు. పదో తరగతిలో శత శాతం ఫలితాలు లక్ష్యంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ అభివృద్ధి అధికారి విజయలక్ష్మి, టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు నరేందర్, కార్యదర్శి రాజ్‌కుమార్, డైట్ కళాశాల ప్రిన్సిపల్ రమేష్‌బాబు, వసతి గృహ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆయుధాలపై పోలీసు సిబ్బంది పరిజ్ఞానం పెంచుకోవాలి

● మెదక్ జిల్లా ఎస్పీ బాలస్వామి



ఫైరింగ్ చేస్తున్న ఎస్పీ బాలస్వామి

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 2: పోలీసు అధికారులు, సిబ్బంది తమ విధుల్లో వినియోగిస్తున్న ఆయుధాల పనితీరుపై పరిజ్ఞానం పెంచుకోవాలని జిల్లా ఎస్పీ డా.బాలస్వామి సూచించారు. మోబిలైజేషన్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో పనిచేస్తున్న పోలీసు అధికారులకు, సిబ్బందికి సిద్దిపేట జిల్లా రాజగోపాల్‌పేట స్టేషన్ పరిధిలో రెండురోజులుగా చేయిస్తున్న ఫైరింగ్ ప్రాక్టీస్‌ను శుక్రవారం ఎస్పీ సందర్శించి, ఫైరింగ్‌ను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు పోలీస్ అధికారులు, సిబ్బంది అధునాతన టెక్నాలజీని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వృత్తి నైపుణాన్ని మెరుగుపరిచేందుకు శిక్షణలు ఎంతగానో ఉపయోగపడుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ మహేందర్, మెదక్, తూప్రాన్, డీఎస్పీలు, సాయుధ దళ డీఎస్పీ, సీఐ, ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

తల్లి మరణంతో మనస్థాపం.. యువకుడి ఆత్మహత్య



అనిల్‌రెడ్డి (ఫైల్)

నర్సాపూర్, ఫిబ్రవరి 2: తల్లిచనిపోయిందని మనస్థాపం చెందిన యువకుడు పురుగుల మందు తాగి శుక్రవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నర్సాపూర్ పట్టణానికి చెందిన అనిల్‌రెడ్డి(27) తల్లి రుక్మిణీ కొన్నిరోజుల క్రితం అనారోగ్యంతో మృతిచెందింది. అప్పటి నుంచి అనిల్ కుమిలిపోతున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కల్వర్టును ఢీకొన్న ద్విచక్ర వాహనం, యువకుడి మృతి



శ్రీనివాస్(ఫైల్)

బెజ్జంకి, ఫిబ్రవరి 2: కల్వర్టును ద్విచక్ర వాహనం ఢీకొన్న సంఘటనలో యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బెజ్జంకి మండల కేంద్రానికి చెందిన బండిపెల్లి శ్రీనివాస్(25) పని నిమిత్తం ద్విచక్ర వాహనాన్ని తీసుకుని వెళ్లాడు. గ్రామ శివారులోని గుండారం వెళ్లే దారిలో ద్విచక్ర వాహనం అదుపు తప్పి కల్వర్టును ఢీకొట్టింది. ఈ ఘటనలో కిందపడిన శ్రీనివాస్ తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, కూతురు ఉన్నారు. మృతుడి తండ్రి పరశురాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేందర్‌రెడ్డి తెలిపారు.

పారబోస్తున్న పాల పైసలెట్లిస్తరు?

- డైయిరీ అధికారుల తీరుపై వెల్లువెత్తుతున్న విమర్శలు
- రైతుల ఆరోపణలకు చేకూరుతున్న బలం
- చేర్యాల బీసీయూలో కొనసాగుతున్న కల్తీ తతంగంపై అనుమానాలు



చేర్యాల పాలశీతలీకరణ కేంద్రం


పాల కేంద్రం ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు

చేర్యాల, ఫిబ్రవరి 2: పాలసేకరణలో ఓ వెలుగు వెలుగొందిన సిద్దిపేట జిల్లా చేర్యాల పాలశీతలీకరణ కేంద్రం నేడు వివాదాల సుడిగుండంలో చిక్కుకుపోయింది. రైతులకు మేలు చేయాల్సిన డైయిరీ అధికారులే 'నేల' పాలు' చేస్తున్న తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సమన్వయంతో గతంలో పాల ఉత్పత్తిలో రాష్ట్రస్థాయిలోనే ఆదర్శంగా నిలిచినా ఇరువర్గాల మధ్య ప్రచ్ఛన్న యుద్ధాన్ని తలపిస్తూ విజయ డైయిరీ ప్రతిష్ఠకు భంగం కలిగించే పరిస్థితి నెలకొన్నది.

చేర్యాల బీసీయూ(బల్క్ బిల్డింగ్ యూనిట్) పరిధిలో చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, ధూళిమిట్ట మండలాల్లో 48 సొసైటీల ద్వారా నిత్యం 9-10వేల లీటర్లు, అత్యల్పంగా 5-6వేల లీటర్ల పాలు సేకరిస్తున్నారు. ఎల్ఆర్ శాతం మేరకు ఆవు పాలు లీటరుకు రూ.40-50, గేదె పాలు లీటరుకు రూ.41-84 వరకు చెల్లిస్తున్నారు. ఈ క్రమంలో వెన్నశాతం అధికంగా వస్తే అధిక ధర పొందొచ్చని పలువురు రైతులు పాలల్లో ఉప్పు, చక్కర కలిపి కల్తీ చేస్తున్నారని డైయిరీ అధికారులు చెబుతున్నారు. ఇదే కారణం పేరిట కొద్దిరోజులక్రితం ఓ ట్యాంకర్ పాలను తిప్పి పంపడంతో చాలామంది రైతులకు నష్టం వాటిల్లడం వివాదానికి దారితీసింది. అయితే కేంద్రానికి చేరిన పాలను బల్క్ టెస్టింగ్ కాకుండా క్యాన్లవారీగా టెస్టింగ్ చేస్తే ఏ ఊరు రైతులు కల్తీచేశారో ప్రాథమికంగా నిర్ధారణ జరగడంతో పాటు ఎలాంటి తప్పు చేయని ఇతర రైతులకు నష్టం జరగదు. కానీ గతనెలలో రెండురోజులపాటు సుమారు 75 క్యాన్ల పాలు నేలపాలు చేశారు. ఈ విషయమై ఇతర రైతులు అధికారుల తీరును తప్పుబడుతూ ఆందోళన చేపట్టారు.


పారబోస్తున్న పాలు(ఫైల్)

అవగాహన లేని వ్యక్తితో టెస్టింగ్ చేస్తున్నారని ఆరోపించడంతో సిద్దిపేట నుంచి సిబ్బందిని రప్పించి రైతుల వద్దకు వెళ్లి ప్రత్యక్షంగా పాలుపితికి పరీక్షలు జరపడంతో ఎలాంటి తేడా రాలేదు. దీంతో ఖంగుతిన్న డైయిరీ అధికారులు క్యాన్లవారీగా టెస్టింగ్ చేపట్టడంతో కల్తీ పరిస్థితి కాస్త మారిపోయింది. కానీ తాజాగా మూడురోజులుగా ధూళిమిట్ట రైతుల పాలను రిజెక్ట్ చేయడంతో కేంద్రం ఎదుట ఆందోళన చేపట్టడం, నష్టపోయిన పాల డబ్బులు ఇస్తామని డీడీ గోపాల్‌సింగ్ చివరకు హామీఇవ్వడం మరోమారు వివాదం తెరమీదకు వచ్చింది.

ఎక్కడా లేనివిధంగా ఇక్కడే సమస్య

ఇతర ప్రాంతాల్లో ఎక్కడాలేని విధంగా బీసీయూలో వివాదాలు కొనసాగుతుండటంతో రైతులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ప్లాంట్ ఆపరేటర్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించడం, ఎప్పటికప్పుడు సెంటర్లను పర్యవేక్షించకపోవడం, పాల ఉత్పత్తికి సంబంధించి రైతులకు సూచనలు ఇవ్వకపోవడం, టెస్టింగ్ పట్ల అవగాహన లేకపోవడంతో సమస్య ఉత్పన్నమవుతుందని చెబుతున్నారు.

పాలసేకరణ తగ్గింపు కోసమేనా?

మహారాష్ట్ర నుంచి రూ.25కు లీటరుపాలు లభ్యమవుతుండటంతో ఇక్కడి రైతులపాలు అధికధరకు ఎందుకు కొనుగోలు చేయాలన్న యోచనతో కల్తీ తతంగం నడిపిస్తూ డైయిరీ ఉన్నతాధికారుల ఆదేశానుసారం స్థానిక అధికారులు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. అందుకే ఇబ్బందులకు గురిచేస్తున్నారని రైతులు వాపోతున్నారు.

పారబోసిన పాలకు ఎవరి జేబులోంచి పైసలిస్తరు?

హైదరాబాద్ డైయిరీకి పంపించిన పాలకు మాత్రమే డబ్బులు చెల్లించాలన్నది నిబంధన. కొద్దిరోజుల క్రితం రిజెక్ట్ అయిన ట్యాంకర్ పాల నష్టం రైతులందరిపై మోపారు. కానీ గతనెలలో తిరస్కరించిన 75 క్యాన్ల పాల డబ్బులను రైతులకు అందిస్తామని బీఎంసీ ఇన్‌చార్జి హామీఇవ్వగా, రెండురోజుల క్రితం తిరస్కరించిన పాల డబ్బులు చెల్లిస్తామని డీడీ గోపాల్‌సింగ్ హామీఇచ్చారు. నేలపాలు చేసినా పాల డబ్బులను ఎలా సర్దుబాటు చేస్తారని ఎవరికి వారుగా భిన్న ప్రకటనలు చేస్తుండటం పట్ల సందేహాలు తలెత్తుతున్నాయి. ప్రజాప్రతినిధులు, డైయిరీ శాఖ ఉన్నతాధికారులు స్పందించి బీసీయూలో నెలకొన్న వివాద పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని పాడి రైతులు కోరుతున్నారు.

త్రిపుర అభివృద్ధి చెందిన రాష్ట్రం

- అలాంటి రాష్ట్రానికి గవర్నర్‌గా పనిచేయడం సంతోషం
- గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి

సిద్దిపేట క్రైం, ఫిబ్రవరి 2: త్రిపుర అభివృద్ధి చెందిన రాష్ట్రమని, అలాంటి రాష్ట్రానికి గవర్నర్‌గా పనిచేయడం సంతోషకరమని త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి అన్నారు.శుక్రవారం ఆయన పౌర సన్మానం కోసం హైదరాబాద్ నుంచి జగిత్యాలకు వెళ్తుండగా మార్గమధ్యలో సిద్దిపేట పట్టణంలోని ఆయన పాత స్నేహితుడు బీజేపీ సీనియర్ నాయకుడు వంగ రామచంద్రారెడ్డి ఇంట్లో అల్పాహారం చేసి విలేకరులతో మాట్లాడారు. త్రిపుర రాష్ట్ర రాజధాని అగర్తలా ఎడ్యుకేషన్ మెడికల్ హబ్‌గా ఉన్నదని తెలియజేశారు. త్రిపుర చిన్న రాష్ట్రం అయినప్పటికీ అనేక రకాలుగా అభివృద్ధి చెందిందని చెప్పారు. అలాంటి రాష్ట్రానికి మిత్రులందరూ రావాలని కోరారు. అనంతరం బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి మోహన్‌రెడ్డి ఇంద్రసేనారెడ్డిని శాలువాతో ఘనంగా సన్మానించారు.

కుష్ఠు నిర్మూలనపై అవగాహన

సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 2: కుష్ఠు నిర్మూలనకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని వైద్య ఆరోగ్య శాఖ డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్లు(డీపీఎం) మారుతి, ప్రతాప్‌గౌడ్ సూచించారు. కుష్ఠు నిర్మూలన పక్షోత్సవాల్లో భాగంగా సంగారెడ్డిలోని సెయింట్ ఆర్నాల్డ్స్ స్కూల్‌లో శుక్రవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. చర్మంపై స్పర్శలేని మచ్చలుంటే కుష్ఠు లక్షణాలుగా భావించవచ్చన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిని సంప్రదించి చికిత్స పొందాలని సూచించారు. అనంతరం కుష్ఠు వ్యాధిని కలిసికట్టుగా నిర్మూలించాలంటూ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పొగాకు నియంత్రణ విభాగం సూపర్‌వైజర్ విష్ణువర్ధన్‌రెడ్డి, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఆశల పూత

- పూతకు వస్తున్న మామిడితోటలు
- 13 వేల ఎకరాల్లో సాగు
- భయపెడుతున్న వాతావరణం


సిద్దిపేట జిల్లా నంగునూరులో పూతతో ఉన్న మామిడి తోట


నంగునూరు మండలం నర్మెట్ట గ్రామంలో మామిడి తోటలో పూతను పరిశీలిస్తున్న జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సునీత

సిద్దిపేట అగ్రికల్చర్, ఫిబ్రవరి 2: నాలుగేళ్లుగా వరుస నష్టాల్లో ఉన్న మామిడి రైతుల ఆశలు చిగురిస్తున్నాయి. ఆలస్యంగానైనా జిల్లాలో మామిడి తోటలు పూతకు వస్తున్నాయి. జనవరి చివరి వారానికల్లా పూర్తిస్థాయి పూత రావాల్సి ఉండగా, ప్రస్తుతం 50 శాతం చెట్లు పూతపట్టాయి. జిల్లాలో 13వేల పైగా ఎకరాల్లో మామిడితోటలు సాగు చేస్తున్నారు. బంగినపల్లి, దసేరి, చెరుకురసాలు, తోతాపరితో పాటు పలు రకాల మామిడి పండ్లు జిల్లాలో సాగవుతాయి. అయితే, వాతావరణంలో మార్పులు రైతులను ఒకింత ఆందోళనకు గురిచేస్తున్నాయి. రోజుల తరబడి మబ్బులు పట్టి, పొగమంచు కమ్ముకుంటుండటంతో చీడపీడల దాడి ఉధృతమవుతుందన్న ఆందోళన రైతులను వెంటాడుతోంది. గతేడాది తీవ్రంగా నష్టపరిచిన పండు ఈగ ఉనికి కలవర పెడుతోంది. దీంతో చీడపీడల నుంచి రక్షించుకునేందుకు వేల రూపాయలు ఖర్చు పెట్టి మందులు పిచికారి చేస్తున్నారు. సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించి పూతను సంరక్షించుకుంటేనే ఆశించిన దిగుబడి వస్తుందని ఉద్యాన శాఖ అధికారులు సూచిస్తున్నారు.

ఎంత చలి ఉంటే.. అంత పూత

పూత వచ్చే సమయంలో వాతావరణ పరిస్థితులు అధిక ప్రభావాన్ని చూపుతాయి. ఎంత చలి ఎక్కువగా ఉంటే అంత ఎక్కువగా పూత వచ్చే అవకాశం ఉంటుంది. రాత్రి పూట 15 డిగ్రీల కంటే తక్కువ ఉష్ణోగ్రతలు నమోదైతే మెరుగైన ఫలితాలుంటాయి. పూత దశలో నీటితడులు నిలిపివేసి.. బెట్ట పరిస్థితులు కల్పిస్తే శాఖీయ పెరుగుదల నిలిచిపోయి మొక్కకు తగినంత విశ్రాంతి లభిస్తుంది. దీని వల్ల చెట్టు పూత సమయానికి సరిపడా పిండి పదార్థం నిల్వ చేసుకోవడమే కాకుండా కొమ్మలు పూర్తి పక్వతకు చేరుకుని ఎక్కువ పూత రావడానికి దోహదపడతాయి. పూమొగ్గ ఏర్పడిన తరువాత నీటి తడులిచ్చి పైపాటుగా ఎరువులు వేసుకోవాలి. చెట్టు వయసును బట్టి సాధారణంగా 500 గ్రాముల నుంచి ఒక కిలో యూరియా, మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేయాలి. పూత బటానీ గింజ సైజు అయ్యేంత వరకు మందులు పవర్ స్ప్రేయర్‌తో పిచికారి చేస్తే పూత రాలిపోయే అవకాశం ఉంది. ఇంకా పూత కనబడని చెట్లపై మల్టీ కే 10 గ్రాములు, యూరియా 5 గ్రాములు ఒక లీటరు నీటికి కలిపి చెట్టుపై పిచికారి చేయాలి. బోరాన్ లోపం ఉన్న తోటల్లో బోరాక్స్ 2 గ్రాములు చొప్పున ఒక లీటరు నీటికి కలిపి స్ప్రే చేస్తే పిందెకట్టు పెరుగుతుంది. పూత సమయంలో తేనె మంచు పురుగు, తామరు పురుగు, ఆకుచుట్టు, పూత చుట్టు, పిండి నల్లి పురుగులు నష్టాన్ని కలిగిస్తాయి. అవి ఆశించినట్లు గుర్తించిన వెంటనే తగిన మందులు స్ప్రే చేసుకోవాలి.

పూత దశే కీలకం

మామిడి పంటలో పూత దశ కీలకం. సున్నితమైన ఈ దశలో చర్యలు చేపట్టి పూతను రక్షించుకుంటేనే ఆశించిన దిగుబడి వస్తుందని ఉద్యానశాఖ అధికారులంటున్నారు. తెగుళ్లపై అవగాహన పెంచుకుని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి. పూత సమయంలో తేనె మంచు పురుగు, తామరు పురుగు, ఆకుచుట్టు, పూత చుట్టు, పిండి నల్లి పురుగులు నష్టాన్ని కలిగిస్తాయి. ఆకుజల్లెడ పురుగు (బల్లి పాతర) చెట్లపై లేకుండా చూసుకోవాలి. తెగుళ్లు ఆశించినట్లు గుర్తించిన వెంటనే తగిన మందులు స్ప్రే చేయాలి. ఆకుమచ్చ, పూతమాడు, నల్లమచ్చ తెగుళ్లు కూడా మామిడి చెట్లపై దాడి చేస్తాయి. ఈ తెగుళ్ల వల్ల దిగుబడిపై ప్రభావం పడుతుంది. సస్యరక్షణ చర్యలు చేపడుతూనే ఎండలు ముదురుతున్నా కొద్ది క్రమం తప్పకుండా నీటి తడులు ఇస్తే మామిడిలో పూత, పిందె రాలకుండా ఉంటుంది.

విరగబూసిన మామిడి పూత

శివ్వంపేట, ఫిబ్రవరి 2: మెదక్ జిల్లా శివ్వంపేట మండల పరిధిలోని చండీ గ్రామ శివారులో దుశాంత్‌రెడ్డి పంట పొలంలోని మామిడి చెట్టుకు పూత విరగబూసింది. చెట్టు నిండా కొమ్మ కనిపించనంతగా పూత పూయడంతో స్థానికులను ఆకట్టుకుంటున్నది.


దొంతిలో విరగబూసిన మామిడిపూత

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

మామిడి తోటలు పూతకు వస్తున్నాయి. వచ్చిన పూతలో ఎక్కువ శాతం పిందె కట్టకుండానే రాలిపోతుండటంతో రైతులు నష్టపోతున్నారు. మామిడి పూతలో ప్రతి పూల గుత్తిలో 4వేల నుంచి 6 వేల పూలు ఉంటాయి. ఇవన్నీ మగపూలే. ఇందులో 1-3 పూలే కాయగా వృద్ధి చెందుతాయి. పూత సంరక్షణలో వాతావరణ పరిస్థితులు, నీటి, పోషక యాజమాన్యం, పురుగులు, తెగుళ్ల బెడద, హార్మోన్ల లోపాలు ప్రధాన భూమిక పోషిస్తాయి. పూత దశలోనే తెగుళ్లను గుర్తించి మందులు స్ప్రే చేసుకోవాలి. సమగ్ర యాజమాన్య, సస్యరక్షణ చర్యలు చేపడితే పూతను రక్షించుకొని, ఆశించిన దిగుబడులు సాధించవచ్చు. ఎలాంటి సమస్యలున్నా ఉద్యాన అధికారులను సంప్రదించాలి.

- భాస్కర్‌రెడ్డి, ఉద్యాన అధికారి, సిద్దిపేట

పాతపంటల వినియోగంతోనే ఆరోగ్యం: డీడీఎస్

ఝరాసంగం, ఫిబ్రవరి 2: పాతపంటల వినియోగంతోనే అందరం ఆరోగ్యంగా ఉంటామని డీడీఎస్ జాతర కోఆర్డినేటర్ వినయ్‌కుమార్, డీడీఎస్ మహిళా రైతులు మొగులమ్మ, గ్రామపెద్దలు పేర్కొన్నారు. డీడీఎస్ ఆధ్వర్యంలో చేపడుతున్న 24వ పాత పంటల జాతర శుక్రవారం మండలంలోని పొట్టిపల్లి గ్రామానికి చేరుకున్నది. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడుతూ చిరుధాన్యాలు క్రమేపీ గ్రామాల్లో కనుమరుగవుతున్నాయని విచారం వ్యక్తం చేశారు. దీంతో 24 ఏళ్లుగా చిరుధాన్యాలను వినియోగించాలని, పంటలను పండించాలని కోరుతూ జహీరాబాద్ నియోజకవర్గంలో ప్రజలను, రైతులను చైతన్యం చేస్తున్నామన్నారు. చిరుధాన్యాలను ప్రతిరోజు ఆహారంలో తీసుకుంటే పోషకాలు లభించడంతో పాటు ఆరోగ్యంగా ఉంటారని పేర్కొన్నారు. అందులో భాగంగా గ్రామంలో చిరుధాన్యాలతో అలంకరించిన ఎడ్లబండ్ల ఊరేగింపు నిర్వహించారు. గ్రామస్థులు రాందాస్, మాణిక్‌పాటిల్, శివప్రసాద్, మల్లికార్జున్, బాల్‌రాజ్, డీడీఎస్ మహిళా రైతులు, జాతర నిర్వాహకులు వినయ్‌కుమార్, మంజుల, పూలమ్మ, విజయలక్ష్మి, లక్ష్మమ్మ, చంద్రమ్మ, కమలమ్మ, జనరల్ నర్సమ్మ, మొగులమ్మ, బాలయ్య, సురేష్ పాల్గొన్నారు.


పొట్టిపల్లి గ్రామంలో నిర్వహించిన జాతరలో పాల్గొని మాట్లాడుతున్న డీడీఎస్ మహిళా రైతు మొగులమ్మ

బిలాల్‌పూర్‌లో ఐదెకరాల అరటి తోట దగ్ధం

- రూ.30 లక్షల నష్టం


తగలబడిపోయిన అరటి తోట

కోహీర్, ఫిబ్రవరి 2: మండల పరిధిలోని బిలాల్‌పూర్‌లో గుర్తు తెలియని వ్యక్తులు ఐదెకరాల అరటి తోటను తగలబెట్టారు. గ్రామానికి చెందిన రైతు కోహీర్ రాచయ్య ఐదు ఎకరాలలో అరటి తోటను సాగు చేశాడు. అయితే బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దీనిని తగలబెట్టారు. అంతేకాకుండా రూ.2 లక్షల విలువ గల డ్రిప్ పైపులను కూడా కాల్చేశారు. ఈ ఘటనలో మొత్తం రూ.30 లక్షల వరకు నష్టం వాటిల్లిందని బాధితుడు తెలిపాడు. ఈ విషయమై పోలీస్‌స్టేషన్‌తో పాటు తహసీల్దార్, ఉద్యానవనశాఖ అధికారులకు ఫిర్యాదు చేశామని పేర్కొన్నాడు. ప్రభుత్వం తనను ఆర్థికంగా ఆదుకోవాలని రైతు రాచయ్య కోరాడు.

రుణాల మంజూరులో రాష్ట్రంలోనే మెదక్ జిల్లా ఫస్ట్

- లక్ష్యం రూ.491.74 కోట్లు, గతనెల 30 నాటికి వందశాతం పంపిణీ
- అధికారులకు మెదక్ కలెక్టర్ రాజర్షిషా అభినందన


మెదక్ అర్బన్, ఫిబ్రవరి 2: స్వయం సహాయక మహిళా సంఘాలకు రుణాల పంపిణీలో మెదక్ జిల్లా రాష్ట్రంలోనే ప్రథమస్థానంలో నిలిచింది. జిల్లాలో 2023-24 ఆర్థిక సంవత్సరానికిగానూ రూ.491.74 కోట్లు లక్ష్యంగా పెట్టుకోగా.. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ద్వారా 8,148 సంఘాలకు రుణాల అందజేసి.. గతనెల 30 నాటికి 100 శాతం పూర్తిచేసింది. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకం ప్రారంభం నుంచి మెదక్ జిల్లాలో వందశాతాన్ని మించి రుణాలు అందించడం ఇదే మొదటిసారి. రుణాల మంజూరులో జిల్లా ప్రథమస్థానంలో నిలువడం పట్ల కలెక్టర్ రాజర్షిషా జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారులను అభినందించారు.

దక్షిణ భారత వైజ్ఞానిక ప్రదర్శనలో ఆదర్శ పాఠశాల నమూనాకు ఐదోస్థానం


విద్యార్థిని నందినికి ప్రశంసాపత్రం, అవార్డు అందజేస్తున్న దృశ్యం

రాయికోడ్, ఫిబ్రవరి 2: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, విజయవాడలో గతనెల 27 నుంచి జరుగుతున్న దక్షిణ భారత వైజ్ఞానిక ప్రదర్శనలో సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండల కేంద్రంలో గల ఆదర్శ పాఠశాల విద్యార్థిని నందిని తయారుచేసిన నీటిని పీల్చే కాంక్రీట్ రహదారుల నమూనా ఐదోస్థానంలో నిలిచింది. గురువారం విజయవాడలో నిర్వహించిన సమావేశంలో నందినికి ప్రశంసాపత్రంతో పాటు అవార్డును అందజేశారు. వైజ్ఞానిక ప్రదర్శనకు దక్షిణ భారతదేశం నుంచి 33 ప్రదర్శనలు ఎంపిక కాగా.. అందులో నందిని తయారుచేసిన నమూనా (సోకింగ్ రోడ్స్) ఐదోస్థానంలో నిలిచింది. దీంతో ప్రిన్సిపాల్ రజినికుమారి, ఉపాధ్యాయులు ఆనందం వ్యక్తం చేశారు. నందినికి గైడ్ టీచర్‌గా వ్యవహరించిన సంధ్యారాణిని అభినందించారు.

రెయిలింగ్‌కు ఢీకొన్న బైక్, ఇద్దరి మృతి


మహ్మద్(ఫైల్)


ఆరిఫ్(ఫైల్)

మెదక్ అర్బన్/శివ్వంపేట, ఫిబ్రవరి 2: రోడ్డు సైడ్ రెయిలింగ్‌కు బైక్ ఢీకొని ఇద్దరు మృతిచెందిన సంఘటన కొల్చారం మండల పరిధిలోని లోతువాగు వద్ద శుక్రవారం చోటు చేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొల్చారం మండల కేంద్రానికి చెందిన ఆరిఫ్(50), మాజీ వార్డుసభ్యుడు మహ్మద్(55) బైక్‌పై కొడిపల్లి నుంచి కొల్చారం వస్తున్నారు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు సైడ్ రెయిలింగ్‌కు ఢీకొన్నారు. ఆరిఫ్ అక్కడికక్కడే మృతిచెందగా. మహ్మద్ ఆసుపత్రికి తరలిస్తుండగా మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గౌస్ తెలిపారు.

వివాహిత అదృశ్యం


లావణ్య(ఫైల్)

మనోహరాబాద్, ఫిబ్రవరి 2: వివాహిత అదృశ్యమైన సంఘటన కాళ్లకల్‌లో చోటు చేసుకున్నది. గ్రామానికి చెందిన పెద్దింటి శివరాజ్ భార్య లావణ్య(26) ఈనెల 31న ఉదయం 8 గంటలకు కాళ్లకల్‌లోని ఫ్యాన్ కంపెనీకి వెళ్తున్నాని చెప్పి వెళ్లింది. సాయంత్రమైనా ఇంటికి తిరిగి రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబసభ్యులు చుట్టుపక్కల వెతికారు. అయినా ఆచూకీ లభించలేదు. శుక్రవారం మామ పెద్దింటి యాదగిరి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వంద శాతం ఉత్తీర్ణతకు
ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి



ఉపాధ్యాయుల రివ్యూ సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో

హుస్నాబాద్/హుస్నాబాద్‌రూరల్/ చేర్యాల, ఫిబ్రవరి 2: 10వ తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా విద్యాధికారి కె శ్రీనివాస్‌రెడ్డి ఉపాధ్యాయులకు సూచించారు. శుక్రవారం ఆయన హుస్నాబాద్ పట్టణంలోని మోడల్ స్కూల్‌లో హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ, బెజ్జంకి మండలాల ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలకు 10వ తరగతి పరీక్షల నిమిత్తం సమీక్షాసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువులో వెనకబడిన విద్యార్థులపై వ్యక్తి గతంగా ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. అలాగే పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం పెంచాలని సూచించారు. సమావేశంలో జిల్లా సెక్టోరియల్ అధికారి బేతి భాస్కర్, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు. అనంతరం హుస్నాబాద్ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో గణిత ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించిన గణిత టాలెంట్ టెస్ట్ పోటీల్లో విజేతలకు డీఈవో శ్రీనివాస్‌రెడ్డి బహుమతులను ప్రదానం చేశారు. చేర్యాల మండలం ముస్త్యాల మోడల్‌స్కూల్‌లో చేర్యాల, మద్దూరు, దూళిమిట్ట మండలా హైస్కూల్ హెచ్‌ఎంలకు సబ్ డివిజనల్ లెవల్ సమీక్షాసమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ ఎఫ్ఎల్ఎన్ ఉన్నతి ప్రోగ్రాంలను ప్రతీ పాఠశాలలో తప్పక నిర్వహించాలని సూచించారు. సమావేశంలో ఎంఈవో నర్సింహారెడ్డి, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

చేర్యాల, ఫిబ్రవరి 2: సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 5వ తరగతిలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి గానూ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ బి. అశోక్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిక విధానం ప్రవేశ పరీక్ష మెరిట్ లిస్టు ఆధారంగా. రిజర్వేషన్ ప్రకారం జరుగుతుందన్నారు. ప్రవేశ పరీక్ష ఈ నెల 11 ఉంటుందని, ఆన్‌లైన్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

గ్రామాల అభివృద్ధిలో పంచాయతీల పాత్ర కీలకం

సర్పంచుల పదవీ కాలం ముగియడంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించింది. శుక్రవారం స్పెషలాఫీసర్లు తమ బాధ్యతలను చేపట్టారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని ఆయా మండలాల్లో ప్రత్యేకాధికారులు, కార్యదర్శులకు పంచాయతీ కార్యాలయాల విధి విధానాలపై అవగాహన కల్పించారు. ఇకపై సర్పంచుల బాధ్యతలు ప్రత్యేక అధికారులు నిర్వహించాల్సి ఉంటుంది.



హుస్నాబాద్ రూరల్: ప్రత్యేకాధికారులకు అవగాహన కల్పిస్తున్న జడ్పీసీఈవో రమేష్‌బాబు



కొండపాకలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్డీఏ పీడీ జయదేవ్

కొండపాక, ఫిబ్రవరి 2: గ్రామాభివృద్ధిలో పంచాయతీల పాత్ర కీలకమని డీఆర్డీఏ పీడీ జయదేవ్ పేర్కొన్నారు. కొండపాకలో పంచాయతీ కార్యదర్శులకు, స్పెషల్ ఆఫీసర్లకు శుక్రవారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శులు స్పెషల్ ఆఫీసర్లు సమన్వయంతో పనిచేసి గ్రామాల్లో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాంరెడ్డి, కొండపాక, కుకునూరుపల్లి స్పెషల్ ఆఫీసర్లు అమీనా, నాగేందర్, ఆర్ డబ్ల్యూఎస్ ఏఈ భూపతి, పీఆర్ ఏఈ తిరుపతిరెడ్డి పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. కాగా శుక్రవారం పలువురు మండలస్థాయి అధికారులు వారికి కేటాయించిన గ్రామాల్లో బాధ్యతలు స్వీకరించారు ఎంఈవో శ్రీనివాసరెడ్డి గిరాయిపల్లిలో బాధ్యతలను స్వీకరించారు. అలాగే మండలస్థాయి అధికారులు వివిధ గ్రామాల్లో బాధ్యతలు స్వీకరించారు.


● **హుస్నాబాద్ రూరల్:** హుస్నాబాద్ మండలంలోని మొత్తం గ్రామ పంచాయతీలకు సంబంధించి 17 మందిని గెజిటెడ్ హోదా అధికారులను కేటాయించింది. శుక్రవారం ఆయా గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక అధికారులుగా వారు బాధ్యతలు చేపట్టారు. స్పెషల్ ఆఫీసర్లకు శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో జిల్లా పరిషత్ సీఈవో రమేష్ బాబు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాఘవేందర్‌రెడ్డి, ఎంపీవో సత్యనారాయణ, ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

● **నారాయణరావుపేట:** నారాయణరావుపేట మండలంలోని మొత్తం 10 గ్రామ పంచాయతీలకు గాను ఏడుగురు ప్రత్యేకాధికారులను నియమించినట్టు ఎంపీడీవో మురళీధర్‌శర్మ శుక్రవారం తెలిపారు. నియామకమైన స్పెషలాఫీసర్లు అందరూ గురువారం రాత్రి బాధ్యతలను చేపట్టినట్టు వెల్లడించారు. మాటిండ్ల ప్రత్యేకాధికారిగా ఎన్. వెంకటేష్ పీఆర్ ఏఈ, మల్యాలకు టి.సత్యం ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, లక్ష్మీదేవిపల్లి- జే.వసంత ఐసీడీఎస్ సూపర్‌వైజర్, గోపులాపూర్, ఇబ్రహీంపూర్ లకు టి.వెంకట రమణి ఏవో, కోదండరావుపల్లి, నారాయణరావుపేట లకు ఎం. మురళీధర్ శర్మ, బంజేరుపల్లి, గుర్రాలాగొందిలకు సీహెచ్. శ్రీనివాస్ మండల పంచాయతీ అధికారి, జక్కాపూర్‌కు ఎల్. లక్ష్మారెడ్డి తహసీల్దార్ ను నియమించారని లెలిపారు.

● **తొగుట:** మండలంలోని 22 గ్రామపంచాయతీలకు ప్రభుత్వం ప్రత్యేకాధికారులను నియమించింది. ముంపు గ్రామాలైన తొగుట మండలం రాంపూర్ గ్రామానికి కిరణ్ (ఐబీ ఏఈ), పల్లెపహాడ్ గ్రామానికి శంకర్ (ఏఎస్‌వో), వేములఘాట్, బ్రాహ్మణ బంజర్‌పల్లి గ్రామాలకు జహీర్(డీటీ), ఏటిగడ్డ కిష్టాపూర్, లక్ష్మాపూర్ గ్రామాలకు శ్రీలక్ష్మి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లను ప్రత్యేక అధికారులుగా నియమించారు. అదే విధంగా మండలంలోని ఎల్. బంజర్‌పల్లి గ్రామానికి అముతుల్ (ఐసీడీఎస్ సూపర్‌వైజర్), పెద్ద మాసాన్‌పల్లి, బండారుపల్లి గ్రామాలకు రామకృష్ణారెడ్డి (పీఆర్‌ఏఈ), గుడికందుల, ఘనపూర్ గ్రామాలకు మోహన్ (ఏవో), గోవర్ధనగిరి, వర్దరాజ్‌పల్లి గ్రామాలకు యాదవరెడ్డి (ఎంఈవో), కాన్గల్, తుక్కాపూర్ గ్రామాలకు శ్రీధర్ (ఎంపీడీవో),ఎల్లారెడ్డిపేట, లింగంపేట గ్రామాలకు చందన (ఎంపీవో), తొగుట గ్రామానికి ప్రతాప్‌రెడ్డి(ఎంఎస్‌వో), లింగాపూర్, జప్తిలింగారెడ్డిపల్లి గ్రామాలకు శ్రీనివాస్ (ఎంపీడీవో ఆఫీస్ సూపరింటెంట్), వెంకట్రావ్‌పేట, చందాపూర్ గ్రామాలకు శ్రీకాంత్ (తహసీల్దార్)లను నియమించినట్లు ఉత్తర్వులు జారీచేశారు. కాగా శుక్రవారం స్పెషలాఫీసర్లు బాధ్యతలను స్వీకరించారు.

● **జగదేవ్‌పూర్:** ప్రత్యేక అధికారులు గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎంపీపీ బాలేషంగౌడ్ పేర్కొన్నారు. శుక్రవారం మండల కార్యాలయంలో ప్రత్యేకాధికారులకు ఎంపీపీ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, ఎంపీడీవో పట్టాభి రామారావు, ఎంపీవో శ్రీనివాస్, తహసీల్దార్ శ్రావణ్‌కుమార్ అధికారులు పాల్గొన్నారు.

మద్యానికి బానిసైన వృద్ధుడి బలవన్మరణం



సత్తయ్య(ఫైల్)

గజ్వేల్ రూరల్, ఫిబ్రవరి 2. మద్యానికి బానిసై వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్‌లో గురువారం రాత్రి చోటుచేసుకున్నది. స్థానికులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రజ్ఞాపూర్‌కు చెందిన ఐలాపురం సత్తయ్య(60) వ్యవసాయం, కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. గురువారం రాత్రి మద్యంమత్తులో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య కనకవ్వ గమనించి స్థానికుల సాయంతో ఆసుపత్రికి తరలించే లోపే మరణించాడు. మృతుడికి కొడుకు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. శుక్రవారం కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు గజ్వేల్ ఏఎస్ఐ పండరి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

తిమ్మారెడ్డిపల్లిలో దొంగల బీభత్సం: మూడిళ్లలో చోరీ

కొండపాక, ఫిబ్రవరి 2: మండలంలోని తిమ్మారెడ్డిపల్లి గ్రామంలో గురువారం రాత్రి దొంగలు బీభత్సం సృష్టించారు. గ్రామస్తులు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సున్నం రాజయ్య కుటుంబ సభ్యులు లకుడారంలో బంధువుల ఇంట్లో శుభకార్యానికి వెళ్లారు. దీంతో దొంగలు ఇంటి తాళాలు పగులగొట్టి ఇంట్లో ఉన్న రూ. 1.50 లక్షల నగదును ఏడు తులాల బంగారు ఆభరణాలను అపహరించారు. అలాగే గ్రామానికి చెందిన ఆరేటి సత్యవ్వ తన ఇంటికి తాళం వేసి పక్కింట్లో నిద్రకు వెళ్లింది. తెల్లారి చూసేసరికి ఇంటి తలుపులు తెరిచి ఉన్నాయి. పింఛన్ డబ్బు ఆరువేల నగదుతో పాటు రెండు తులాల బంగారం చోరీ అయ్యాయి. కావటిప్రవీణ్ కుమార్ తన కుటుంబ సభ్యులతో ఇంటికి తాళాలు వేసి కొమురవెల్లికి వెళ్లారు ఉదయం వచ్చి చూసేసరికి ఇంట్లోనే వస్తువులు చిందరవందరగా ఉన్నాయి. ఇంట్లో ఉన్న వెండి ఆభరణాలు, రూ.5 వేల నగదు చోరీ జరిగింది. శుక్రవారం కుకునూరు పల్లి పోలీసులు క్లూస్ టీంను రప్పించి ఆధారాలను సేకరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

వివాహితను వేధించిన ఆకతాయికి దేహశుద్ధి

చేర్యాల. ఫిబ్రవరి 2: చేర్యాల పట్టణంలో ఓ వివాహితను వేధించిన ఆకతాయికి కుటుంబ సభ్యులు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. ఎస్ఐ దామోదర్ తెలిపిన వివరాల ప్రకారం. ఓ వార్తా పత్రికకు చెందిన విలేకరి బొందిలి గణేష్ ప్రసాద్ పట్టణంలోని వివాహితకు సంబంధించిన ఫొటోలతో బ్లాక్‌మెయిల్‌కు పాల్పడి వేధించడంతో బాధిత మహిళ కుటుంబ సభ్యులకు తెలిపింది. దీంతో వారు నిందితుడికి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్టు ఎస్ఐ తెలిపారు.

'జప్తి నాచారం' ఘర్షణపై విచారణ

కొండపాక, ఫిబ్రవరి 2 : మండలంలోని జప్తి నాచారంలో గురువారం జరిగిన ఘర్షణపై కుకునూరుపల్లి ఎస్ఐ పుష్పరాజ్ శుక్రవారం విచారణ జరిపారు. గ్రామ పంచాయతీల పాలన ముగియడంతో గురువారం పాలకవర్గానికి సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంలో కాంగ్రెస్ పార్టీ, బీఆర్ఎస్ నాయకుల మధ్య ఘర్షణ తలెత్తి ఇరు వర్గాల వారు దాడి చేసుకున్నారు. ఈ విషయంలో ఇరువర్గాలవారు కుకునూరుపల్లి పోలీస్ స్టేషన్‌లో పరస్పర ఫిర్యాదు చేసుకోవడంతో ఎస్ఐ పుష్పరాజ్ విచారణ జరిపారు. ఘటనాస్థలంలో ఉన్నవారితో మాట్లాడి వివరాలను సేకరించారు.

పాన్‌షాపులు, బేకరీల్లో తనిఖీ

కోహెడ, ఫిబ్రవరి 2: మండల కేంద్రంలోని పాన్ షాపులు, బేకరీ దుకాణాలను ఎస్ఐ తిరుపతి ఆధ్వర్యంలో శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. నిషేధిత మత్తుపదార్థాలు జోరుగా అమ్మకాలు జరుగుతున్నట్లు ప్రచారం జరగడంతో తనిఖీలు నిర్వహించామని ఎస్ఐ పేర్కొన్నారు. అలాగే ప్రతీ షాపు యజమాని సీసీటీవీ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

'సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి'

హుస్నాబాద్, ఫిబ్రవరి 2: వ్యాపార సముదాయాల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని ఎస్ఐ తోట మహేశ్ వ్యాపారులకు సూచించారు. శుక్రవారం ఆయన హుస్నాబాద్‌లోని మెయిన్ రోడ్డులో వ్యాపార, వాణిజ్య సముదాయాలు, దుకాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా సీసీ కెమెరాలు, భద్రత చర్యలు పాటించని యజమానులకు నోటీసులు జారీ చేశారు.

చేయూత కింద రూ.6 వేలు వెంటనే అమలు చేయాలి

సిద్దిపేట అగ్రికల్చర్, ఫిబ్రవరి 2: దివ్యాంగుల ఆసరా పింఛన్లతో పాటు వారికి సరైన ఉపాధి చూపించాలని, సిద్దిపేట పాత బస్టాండ్ అంబేడ్కర్ చౌక్ వద్ద దివ్యాంగుల నాయకులు కెమ్మసారమ్మ అశోక్, దుబ్బాక శెట్టి నరసింహులు, గడ్డమీది లచ్చయ్య, తొడంగల్ యాదగిరి, వడ్డే పరశురాములు, రమేష్, రాములు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇదివరకు రూ.4 వేలు పెన్షన్ ఇచ్చేవారని, నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం రూ. 6 వేలు ఇస్తానని హామీ ఇచ్చినప్పటికీ గత నెలలో సిద్దిపేట జిల్లాలో పెన్షన్లు ఏ బ్యాంకులో కూడా పడలేదని అసహనం వ్యక్తం చేశారు. ప్రభుత్వం దివ్యాంగుల పట్ల చిన్నచూపు చూడద్దని వారు విజ్ఞప్తి చేశారు.

'డబుల్' లబ్ధిదారుల్లో అనర్హులను తొలగించండి

● గజ్వేల్ ఆర్డీవోకు సీపీఎం నాయకుల వినతి

గజ్వేల్, ఫిబ్రవరి 2: గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారుల జాబితాలో అనర్హులను తొలగించి, అర్హులకు ఇళ్లను ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సందబోయిన ఎల్లయ్య కోరారు. గజ్వేల్ లోని ఐవోసీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించిన అనంతరం ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో బన్సీలాల్‌కు శుక్రవారం డబుల్ బెడ్‌రూం ఇళ్ల ఆశావహులతో కలసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎల్లయ్య మాట్లాడుతూ దివ్యాంగులకు, ఇళ్లులేనివారికి, పట్టా సర్టిఫికెట్లు ఉన్న వారికి ప్రథమ ప్రాధాన్యతగా ఇళ్లను ఇవ్వాలన్నారు. వెంటనే సమగ్రంగా సర్వే నిర్వహించిన అసలైన అర్హులకు ఇళ్లను కేటాయించాలని డిమాండ్ చేశారు. వారితో నర్సింహులు, తలకొక్కుల పద్మ, పద్మ, కవిత, అనిత, లక్ష్మి, మహేందర్, శివ, సంపత్, యాదగిరి, సత్తయ్య ఉన్నారు.

డిగ్రీ కళాశాలలో మౌలికవసతులు కల్పించాలి

సిద్దిపేట క్రైం, ఫిబ్రవరి 2 : సిద్దిపేట పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో మౌలిక వసతులు కల్పించాలని ఏబీవీపీ నాయకులు శుక్రవారం డిగ్రీ కాలేజీ ముందు నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఏబీవీపీ స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్ వివేక్ వర్ధన్ మాట్లాడుతూ సిద్దిపేట జిల్లాలోని ప్రతిష్ఠాత్మకమైన ప్రభుత్వ డిగ్రీ కళాశాల సిద్దిపేటలోని విద్యార్థులు కనీస మౌలిక వసతులు కరువయ్యాయని అన్నారు.మొన్న జరిగినటువంటి సెమిస్టర్ లో అవకతవకలు జరిగాయని అధికారుల దృష్టికి తీసుకెళ్తే పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో జిల్లా హాస్టల్ కన్వీనర్ చరణ్‌నగర కార్యదర్శి హరీశ్, కళాశాల కార్యదర్శి పర్శారాం, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇష్టపడి చదివితేనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్

హుస్నాబాద్‌రూరల్, ఫిబ్రవరి 2: విద్యార్థి దశలో ఉన్న ప్రతీ విద్యార్థి ఇష్టంతో చదివితేనే వారి జీవితంలో ఉజ్వల భవిష్యత్‌తో పాటు తాము అనుకున్న లక్ష్యం చేరే అవకాశం ఉంటుందని లయన్స్ కెప్టెన్ బుర్ర మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం హుస్నాబాద్‌లోని సీవి రామన్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో పదోతరగతి విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పాఠ్యాంశాల్లో పట్టుసాధిస్తునే మంచి అలవాట్లతో కూడిన వ్యక్తిత్వ వికాసం, ప్రయోగశాల నైపుణ్యాల పట్ల ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో లయన్స్ సభ్యులు ఎం మహేందర్, చిట్టిగోపాల్‌రెడ్డి, కాయిత నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలి



రాయవరంలో కూలీలతో కలిసి కేక్ కట్ చేస్తున్న ఏపీడీ

జగదేవ్‌పూర్, ఫిబ్రవరి 2: ఉపాధి హామీ కూలీలు ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలని ఏపీడీ కౌసల్యాదేవి పేర్కొన్నారు. శుక్రవారం ఉపాధి హామీ దినోత్సవం సందర్భంగా మండలంలోని రాయవరం గ్రామంలో కూలీలతో కలిసికేక్ కట్ చేసి సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈజీఎస్ పనులు చేసే కూలీలందరూ వంద రోజులు పని చేయాలని కోరారు. అలాగే ప్రతి రోజూ 272 కూలీ వేతనం తగ్గకుండా పనులు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీవో శ్రీనివాస్, ఏపీవో లక్ష్మి, టీఏలు కరుణకర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, రాజు, నరేష్, ఎఫ్ఏలు గౌస్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

'విద్యార్థులు ఇష్టంతో చదవాలి'

మిరుదొడ్డి, ఫిబ్రవరి 2: విద్యార్థులు కష్టంతో కాకుండా ఇష్టంతో చదివితేనే మంచి ఫలితాలను సాధించవచ్చునని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి సూర్య ప్రకాష్ తెలిపారు. శుక్రవారం మిరుదొడ్డిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు జరుగుతున్న ప్రాక్టికల్ పరీక్షలను తనిఖీ చేశారు. ఆయన వెంట ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తదితరులున్నారు.

సీవోఈ పరీక్షకు హాల్ టిక్కెట్ తప్పనిసరి

సిద్దిపేటరూరల్, ఫిబ్రవరి2: రాష్ట్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ కళాశాలలో అడ్మిషన్ పొందేందుకు ఈనెల 4తేదీ ఆదివారం ప్రవేశ పరీక్ష ఉంటుందని జిల్లా సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల జిల్లా కోఆర్డినేటర్ కె.నిర్మల తెలిపారు. ఇదివరకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు మాత్రమే ఈ ప్రవేశ పరీక్షకు హాజరవ్వాల్సి ఉంటుందన్నారు.

విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీయాలి

సిద్దిపేటరూరల్, ఫిబ్రవరి 2: సిద్దిపేట పట్టణంలో ఇందిరమ్మ కాలనీలో గల నలంద విద్యాలయంలో సెమ్స్ ఒలంపియాడ్ ప్రశ్నాపత్రాలను స్టేట్ మెడికల్ కౌన్సిల్ మెంబర్ పాల సాయిరాం, ట్రస్మా సంఘం జిల్లా ప్రతినిధులతో కలిసి విడుదల చేశారు. సిద్దిపేట జిల్లా ట్రస్మా అధ్యక్షుడు గజ్జల సంజీవరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు పోటీ పరీక్షలో పాల్గొనే మెలకువలు నేర్చుకోవచ్చన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ట్రస్మా జిల్లా కోశాధికారి గాలిపల్లి హరినాథ్, పొకల సంతోష్ కుమార్, పాత్రికేయులు సంజీవరెడ్డి, పాఠశాల అధ్యాపక బృందం పాల్గొన్నారు.

కుకునూరుపల్లిలో గడ్డివాము దగ్ధం

కొండపాక, ఫిబ్రవరి 2 : కుకునూరుపల్లికి చెందిన బక్కని యాదగిరి అనే రైతు పొలం వద్ద ఉన్న గడ్డివాము ప్రమాదవశాత్తు గురువారం రాత్రి దగ్ధమైంది. ఈఘటనలో 200 కట్టల పశువుల గడ్డి దగ్ధమైంది. అగ్నిమాపక వాహనం వచ్చి మంటలు ఆర్పినప్పటికీ గడ్డి పూర్తిగా దగ్ధమైంది. సుమారు రూ.50 వేల నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు.

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

చిన్నకోడూరు, ఫిబ్రవరి 2: రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సిద్దిపేట రూరల్ సీఐ యం. శ్రీను పేర్కొన్నారు. రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా మండలంలోని రామునిపట్ల గ్రామంలో శుక్రవారం సాయంత్రం ఎస్ఐ సుభాష్ గౌడ్‌తో కలిసి వాహనదారులకు ప్రజలకు మైనర్ డ్రైవింగ్, ట్రాఫిక్, రోడ్డు నిబంధనల గూర్చి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ దేవయ్య, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయ దంపతుల విరాళం

మిరుదొడ్డి, ఫిబ్రవరి 2:అక్బర్‌పేట-భూంపల్లి మండలం భూంపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాల టీఎల్ఎం కొనుగోలు కోసం శుక్రవారం ఆదేగ్రామానికి చెందిన ఉపాధ్యాయ దంపతులు కమ్మరి హరికృష్ణ, రాదపద్మజలు రూ. 20వేలను విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు భిక్షపతి, ఉపాధ్యాయులు తదితరులున్నారు.

ఉపాధిహామీ పథకంపై అవగాహన

మద్దూరు, ఫిబ్రవరి 2: మండలంలోని రేబర్తి గ్రామంలో శుక్రవారం జాతీయ ఉపాధిహామీ పథకం దినోత్సవాన్ని పురస్కరించుకుని టీఏ వెంకటమ్మ వేజ్ సీకర్స్‌కు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా టీఏ వెంకటమ్మ మాట్లాడారు. ఉపాధిహామీ పథకాన్ని కూలీలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

స్టాక్, బిల్‌బుక్ లేకుంటే చర్యలు

జిల్లా వ్యవసాయాధికారి శివప్రసాద్



కోహెడలో పొలాలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్, వ్యవసాయ శాస్త్రవేత్త విజయ్

కోహెడ, ఫిబ్రవరి 2: స్టాక్‌బుక్, బిల్‌బుక్ ప్రతీ ఫర్టిలైజర్ షాప్‌లో ఉండాలని, లేని పక్షంలో సదరు డీలర్‌పై తగు చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్ హెచ్చరించారు. శుక్రవారం మండల కేంద్రంలోని పీఏసీఎస్, అశ్విని, అగ్రోస్, గ్రోమోర్ ఫర్టిలైజర్ షాప్‌లను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ప్రతీ డీలర్ వద్ద 10 టన్నులకు తగ్గకుండా యూరియా స్టాక్ ఉండాలన్నారు. అలాగే పీవోఎస్ మెషిన్ ద్వారానే అమ్మకాలు చేపట్టాలని సూచించారు. ప్రస్తుతం కోహెడ మండలంలో 500 ఎం.టి. యూరియా రైతులకు అందుబాటులో ఉన్నదన్నారు. ఆధార్ కార్డు తీసుకొని ఎరువులు కొనుగోలు చేయాలని, పంట పొలాలకు అధిక మోతాదులో ఎరువులు వాడకూడదన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి భోగేశ్వర్, విస్తరణ అధికారులు శివకుమార్, రూప, మహిపాల్ , రైతులు పాల్గొన్నారు. కాగా మండలంలోని వరికోలు, శనిగరం గ్రామాలలోని వరి పొలాలను జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్, వ్యవసాయ శాస్త్రవేత్త విజయ్ పరిశీలించారు. వారు మాట్లాడుతూ వరిలో కాండం తొలుచు పురుగు ఉధృతి అధికంగా ఉందని చెబుతూ, దాని నివారణకు చర్యలను సూచించారు.

రైతాంగ సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం



నీటి విడుదల సందర్భంగా పూజలు చేసి పూలను చల్లుతున్న ఎస్ఈ వేణు, నర్సారెడ్డి తదితరులు

గజ్వేల్, ఫిబ్రవరి 2: ప్రతీ ఎకరాకు సాగునీరిస్తామని సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి అన్నారు. గజ్వేల్ మండలం కొడకండ్ల వద్ద మల్లన్నసాగర్ కాలువ నుంచి కూరెల్లి(కూడవెల్లి) వాగులోకి గోదావరి జలాలను కాళేశ్వర్ ఎస్ఈ వేణు, దుబ్బాక కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డితో కలసి శుక్రవారం ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం నర్సారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ రైతుల పక్షాన నిలబడేది కాంగ్రెస్ ప్రభుత్వమేనన్నారు. యాసంగి పంటకు పూర్తిగా నీరు సరిపోతదని, బీఆర్ఎస్ నాయకులు రైతులను రెచ్చగొట్టి రోడ్లపై ధర్నా చేయిస్తున్నారన్నారని మండిపడ్డారు. రైతులకు గతంలో ఒకేదఫాలో రుణమాఫీ, ఉచిత విద్యుత్ ఇచ్చిన ప్రభుత్వం కాంగ్రెస్ మాత్రమేనని, ప్రస్తుతం రైతులకు ఏ అవసరం ఉన్నా అందుబాటులో ఉంటామన్నారు. వారి వెంట నాయకులు నాయిని యాదగిరి, మద్దూరి మల్లారెడ్డి, మాదాడి మహేందర్‌రెడ్డి, యాదగిరి, మోహన్న గారి మదన్‌మోహన్‌రెడ్డి, మాధవరావు, తుప్పతి అంజయ్య, వెంకట్రాంరెడ్డి, నక్క రాములు, మల్లారెడ్డి, శివరాంరెడ్డి, బాబ, అజ్గర్, శ్రీనివాస్‌రెడ్డి, నర్సింలు తదితరులున్నారు.

●**ములుగు:** పేదల సంక్షేమ కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ములుగు మండలం కొత్తూరు గ్రామానికి బీఆర్ఎస్ నాయకులు నర్సారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

పంటలను పరిశీలించిన అధికారులు



కొండపాక: పొలంలో మొగి తీవ్రతను పరిశీలిస్తున్న అధికారులు

కొండపాక, ఫిబ్రవరి 2: వరి పంటలో సోకుతున్న మొగి పురుగు నివారణ చర్యలను రైతులు చేపట్టాలని గజ్వేల్ వ్యవసాయ సంచాలకుడు బాబునాయక్ సూచించారు. మండలంలోని పలు గ్రామాల్లో పంట పొలాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు పలు సూచన చేశారు. పొలాల్లో వరి పంటపై మొగి పురుగు గుర్తించినట్టు తెలిపారు. నివారణకు కార్బోఫోరాన్ వేయాలని తెలిపారు. కొందరు రైతులు వరిలో బయోగుళికలు వేస్తున్నారని. ఈ గుళికలు కేవలం పెరుగుదలకు మాత్రమే తోడ్పడతాయిని పేర్కొన్నారు. కొండపాక పీఏసీఎస్‌లో స్టాక్ నిలువలను తనిఖీ చేశారు.

కాండం తొలుచు పురుగు నివారణకు చర్యలు

మద్దూరు, ఫిబ్రవరి 2: వరిలో కాండం తొలుచు పురుగు నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి బూరెల రామకృష్ణ సూచించారు. శుక్రవారం దూళిమిట్ట మండలంలోని కూటిగల్‌లో తిగుళ్ల శ్రీనివాస్ రైతు పొలాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వరి పంటను పరిశీలించారు. మొగి పురుగు నివారణకు లిఫ్రోల్ ఎకరాకు 60 మిల్లీలీటర్ల చొప్పున పిచికారి చేయాలని సూచించారు. వరి సాగు చేసిన రైతులు నాటిన 20 రోజులకు ఒక సారి హైడ్రో క్లోరైడ్ 4జి గుళికలను ఎకరాకు 7 నుంచి 8 కేజీలు చల్లుకోవాలన్నారు. ఏఈవో అనూషతో పాటు రైతులు తదితరులు పాల్గొన్నారు.



మహ్మదాపూర్‌లో దుకాణం వద్ద నిలువెత్తు బంగారం(బెల్లం) తూకం వేయించుకుంటున్న భక్తులు

ముందస్తు మొక్కులు

హుస్నాబాద్ రూరల్, ఫిబ్రవరి 2: సమ్మక్క-సారలమ్మ తీర్చుకునే భక్తులు ముందస్తుగా మొక్కులు సమర్పించుకునేందుకు దుకాణాల ముందు తమ నిలువెత్తు బంగారం(బెల్లం)ను తూకం వేయించుకుంటున్నారు. ఈ నెల 21నుంచి సమ్మక్క-సారలమ్మ జాతర ఉండటంతో భక్తుల రద్దీ పెరిగే అవకాశం ఉందని గ్రహించిన భక్తులు 20 రోజుల ముందు నుంచే మొక్కులు చెల్లించుకుంటున్నారు. హుస్నాబాద్ మండలంలోని ఆయా గ్రామాల్లో శుక్రవారం బెల్లం తూకం వేయించుకోవడం కోసం దుకాణాల ముందు కుటుంబ సభ్యులతో బారులు తీరారు.


గ్రామాల్లో తాజా మాజీ సర్పంచులకు సన్మానం



గజ్వేల్‌లో తాజామాజీ సర్పంచులను సన్మానిస్తున్న దృశ్యం

గజ్వేల్, ఫిబ్రవరి 2: గ్రామాలను పచ్చగా, పరిశుభ్రంగా మార్చిన ఘనత తాజామాజీ సర్పంచ్‌లదేనని శాసనమండలి సభ్యులు డాక్టర్ వంటేరి యాదవరెడ్డి, సిద్దిపేట జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ వేలేటి రోజాశర్మ పేర్కొన్నారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని మల్లారెడ్డి గార్డెన్స్‌లో శుక్రవారం గజ్వేల్ జడ్పీటీసీ పంగ మల్లేశం ఆధ్వర్యంలో గజ్వేల్ మండల తాజా మాజీ సర్పంచులకు సన్మానం చేశారు. వారితో గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, జడ్పీటీసీ పంగ మల్లేశం, నాయకులు మాదాసు శ్రీనివాస్, రాజిరెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి ఆయా గ్రామాల తాజామాజీ సర్పంచ్‌లు, తదితరులున్నారు.

గిరాయిపల్లి, గాగిల్లాపూర్ పాలకవర్గాలకు..



గిరాయిపల్లి పంచాయతీ పాలకవర్గ సభ్యులకు సన్మానం

కొండపాక/బెజ్జంకి, ఫిబ్రవరి 2: కొండపాక మండలంలోని గిరాయిపల్లి గ్రామపంచాయతీ పదవీకాలం ముగియడంతో శుక్రవారం సర్పంచ్ సంజీవరెడ్డి గ్రామస్థాయి అధికారులకు సిబ్బందికి వార్డు సభ్యులకు సన్మానం చేశారు. ఆదేవిధంగా బెజ్జంకి మండలంలోని గాగిల్లాపూర్ గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులను శుక్రవారం మహిళా సంఘాల ఆధ్వర్యంలో శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



గాగిల్లాపూర్‌లో పంచాయతీ పాలకవర్గం సభ్యులకు సన్మానం

ఎస్సెస్సీ విద్యార్థులకు గణితం టాలెంట్ టెస్ట్

● **విజేతలు జిల్లాస్థాయికి ఎంపిక**



కొండపాక: టాలెంట్ టెస్టులో విజేతలైన విద్యార్థులు

నారాయణరావుపేట, ఫిబ్రవరి 2: మండల స్థాయిలో నిర్వహించిన గణిత ప్రతిభా పోటీ పరీక్షల్లో ముగ్గురు విద్యార్థులు జిల్లా స్థాయికి ఎంపికైనట్లు నారాయణరావుపేట జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వడ్డెపల్లి నాగరాజు తెలిపారు. శుక్రవారం పాఠశాలలో మండల స్థాయిలో పదో తరగతి విద్యార్థులకు గణిత ప్రతిభాపోటీ పరీక్షలు నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు నాగరాజు మాట్లాడుతూ మండల కేంద్రంలోని పాఠశాలతో పాటు జక్కాపూర్, గుర్రాలగొంది, లక్ష్మీదేవిపల్లి పాఠశాలల విద్యార్థులు ఈ పోటీ పరీక్షల్లో పాల్గొనగా జక్కాపూర్ పాఠశాలకు చెందిన జస్వంత్, సమిక్ష, నారాయణరావుపేట పాఠశాలకు చెందిన కె.విహారిక జిల్లాస్థాయికి ఎంపికయ్యారని చెప్పారు. జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థులను గణిత శాస్త్రం ఉపాధ్యాయ బృందం అభినందించింది.

● **అక్కన్నపేట:** మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తెలంగాణ మ్యాథ్స్ ఫోరం మండల శాఖ ఆధ్వర్యంలో గణిత టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఐ తాండ్ర వివేక్, మ్యాథ్స్ ఫోరం అధ్యక్షుడు చందా మురళీధర్, మండల కార్యదర్శి అందే సంపత్, పాఠశాల ఇన్‌చార్జి హెడ్‌మాస్టర్ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు. టాలెంట్ టెస్ట్‌లో ప్రథమస్థానంలో మల్లంపల్లి, రామవరం పాఠశాలల విద్యార్థులు గిరిమల్ల హర్షవర్దన్, కె. శైలజ, ద్వితీయ స్థానం జనగామ పాఠశాల విద్యార్థి ఎం అక్షయ, తృతీయ స్థానం గౌరవెల్లి పాఠశాల కె.నందిని, గోవర్ధనగిరి పాఠశాల తేజస్విని సంయుక్త విజేతలుగా నిలిచారు.

● **చేర్యాల:** మండలంలోని ముస్త్యాల మోడల్‌స్కూల్‌లో విద్యార్థులకు శుక్రవారం గణితంపై టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ దుర్గాప్రసాద్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంఈవో నర్సింహారెడ్డి పాల్గొని మాట్లాడారు. టాలెంట్ టెస్ట్‌లో 50 మంది పాల్గొనగా సాయిచరణ్, సూర్యకాంత్, భరద్వాజ్, కోమల, కార్తీక్, శిరీషలను జిల్లాస్థాయి పరీక్షకు ఎంపికైనట్లు తెలిపారు.

● **కొండపాక:** కొండపాక బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం ప్రధానోపాధ్యాయుడు విఠల్‌నాయక్ ఆధ్వర్యంలో మండలస్థాయి గణితం లాలెంట్ పరీక్షను నిర్వహించారు. కార్యక్రమంలో మండల నోడల్ ఆఫీసర్ పెద్ది విఠల్, కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. పరీక్షలో కొండపాక బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు వి.జాహ్నవి ప్రథమ, కె.అనూష ద్వితీయ, ఖమ్మం పల్లి పాఠశాలకు చెందిన భార్గవి వైష్ణవిలు సంయుక్తంగా తృతీయ స్థానాన్ని పొందారు. తెలుగు మీడియం లో సిరిసినగండ్ల పాఠశాలకు చెందిన అస్మిత ప్రథమ, మౌనిక ద్వితీయ, దుద్దెడ పాఠశాలకు చెందిన అనుష్క తృతీయ స్థానాన్ని పొందారు.

● **నంగునూరు:** తెలంగాణ గణిత ఫోరం మండల శాఖ ఆధ్వర్యంలో వివిధ పాఠశాలల్లో పదోతరగతి చదువుతున్న విద్యార్థులకు శుక్రవారం నంగునూరు ఉన్నత పాఠశాలలో గణిత టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో తగిరెడ్డి దేశిరెడ్డి స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి. రామస్వామి, గణిత ఫోరం మండల శాఖ అధ్యక్షులు ఎ.సత్యనారాయణతో కలసి ప్రశ్నాపత్రాన్ని విడుదల చేశారు. ఈ టాలెంట్ టెస్ట్ లో కె కృషిత ప్రథమ స్థానం (నంగునూరు), ఆర్.శృతి, బి.అవినాష్‌రెడ్డి ద్వితీయస్థానం(నర్మెట్ట), తెలుగు మీడియంలో జి అఖిల ప్రథమ స్థానం, శివకుమార్ (నర్మెట) బిందు శ్రీ, సాగర్ (గట్ల మల్యాల) ద్వితీయ స్థానం సాధించి విజేతలుగా నిలిచి జిల్లాస్థాయికి ఎంపికయ్యారు. విజేతలకు బహుమతుల ప్రదానం చేశారు.